కానరాని శిక్ష

నిరంజనరావు కారులోంచి దిగి సూటిగా తన గదిలోకి వెళ్ళి పడక కుర్చీలో చేరగిల పడ్డాడు. చేతులు రెండూ వెనక్కు చాచి కళ్ళు మూసుకున్నాడు. ఆయన వచ్చిన అలికిడి విని గబ గబ సుగుణ గదిలోకి వెళ్ళింది. భర్త మొహంలోకి చూస్తూ అట్లాగే నిల బడి పోయింది. సుగుణ వచ్చినట్టు గమనించినాకూడా ఆయన కళ్ళు తెరవ లేదు. కొంచెం సేపు విలవిలలాడి పోతూ అట్లాగే పట్టు బిగువున నిలబడి యిహ వుండ బట్టలేక 'ఏవండీ' అంటూ దగ్గరగా వెళ్ళి కుర్చీలో కూర్చుంది జాలిగా.

'ఊ ...' అన్నాడు కళ్ళు తెరవకుండానే నిరంజనరావు. దుఃఖం ఆపుకోలేకపోయింది వెక్కి వెక్కి ఏడ్చింది మళ్ళీ తమా యించుకుని పెద్దగా నిట్టూర్చింది

కళ్ళు తెరుచుకుని భార్య వంక ఆలోచనగా చూస్తూ ముందుకు ఒరిగి కూర్చున్నాడు.

'చూడు సుగుణా' అంటూ ఆమె తల మీద నిమురుతూ పెదిమలు బిగపెట్టి కళ్ళజోడు అద్దాలు తుడుస్తూ పెద్దగా నిట్టూర్చాడు. ఎడం చెయ్యి గుప్పెడు గట్టిగా నొక్కి పెట్టేసి గుటకలు వేస్తూ తెగ ఆయాస పడుతున్నాడు. భర్త ఆవేదన, ఆరాటం చూసి కళ్ళు తుడుచుకుంటూ నేను ఆపుకోలేకపోయానండి అన్నది తానేదో తప్పు చేసినట్టుగా.

"....సుగుణా నువ్వు తల్లివి. నేను తండ్రిని. మనిద్దరికీ కూడా ప్రేమలు, బాధ్యతలు ఒకటే తల్లివని నీ కెక్కువ ప్రేమ వుందని అనుకుంటే తండ్రిగా నా కెక్కువ బాధ్యత వుందని నేననుకోవచ్చు. ఏమైనా మనిద్దరం గూడా ఒకే స్థితిలో వున్నాం. ఏమీ చెయ్యలేని అశక్తత గుర్తించికూడా పదేపదే బాధ పడితే ఏం ప్రయోజనం.... ఇంకా యేదో చెప్ప బోతుంటే "అంతే నంటారా" అన్నది ఆవేశంగా, భర్త మొహంలోకి పిచ్చిదాని లాగ చూస్తూ.

నీ కింకా అర్థం కాలేదు. మన చేతిలో యేదో వుందని భ్రమ పడుతున్నావు. ఈ సమయంలో మనం సరిగ్గా అర్థంచేసుకోవా ల్సింది యెంతోవుంది.... నీకింకా నమ్మకం కుదరటంలేదు. పెంచిన పెంచుకున్న మమకారము, నిన్నట్లా బాధపెడుతోంది అంతే...."

"మీకూ అంతకంటె యెక్కువే మమకారాలు ప్రేమలు వున్నాయి. నేను కాదనటం లేదు... మీ మాటకు అడ్డు చెప్పానని అనుకోవద్దు. వాడిమీద ఎన్ని ఆశలుపెట్టుకున్నాం ఎన్నెన్ని ఆలోచనలుచేశాం. ఏమేమో అనుకున్నామే అవన్నీ కూడా వృధా అయిపోయినాయా...."

"నిజమే మనము ఆలోచించింది వేరు, జరగబోయేది వేరు. దీనికి మనమేం చేస్తాం చెప్పు..."

'మీకు తెలీదా. నా చేత చెప్పించాలా...' ఉక్రోషం ఆపుకోలేక పోయింది.

"....అక్కడే నువ్వు చాలా పొరపాటు పడుతున్నావు... నా చేత్తో నేను యెంత మందికి యెన్ని రకాల శిక్షలు విధించానో, యెన్ని ఉరిశిక్షలు వేశానో నీకన్నీ తెలుసు నాకు రహస్యాల టూలేవు. ఏమైనావున్నా, నీలోనే దాచుకున్నా. నీకు తెలియని విషయమేమీ కాదు. నేను న్యాయం చేశానని కాని, దుష్టులను శిక్షించానినిగాని యెన్నడూ అనుకోలేదు నేను కేవలం నా విద్యుక్త ధర్మం నెరవేర్చాను. అంతే. ఇవ్వాళ నేను యింకోళ్ళ దగ్గరకు కర్తవ్యానికి వ్యతిరేకంగా చెయ్యమని ఏ మొహం పెట్టుకుని వెళ్ళగలను.... వెళతాను. వాడికోసం ఏదైనా చేస్తాను వాడు లేకపోయిన తర్వాత, నేనుంటే యేం, లేకపోతే యేం ఇది కూడా, ఆలోచించాను. కాని తీరా మనం వెళ్ళి దేహీ అన్న తర్వాత, కాదంటే, నా తల తీసేసి నట్టేగా. అందులో ఆయన నా కంటే కూడా రూల్సు, లా పాటించేవాడు. అదే నా భయం..."

"అంతే నంటారా..."

"అవును సుగుణా అంతే అంతకంటె యేముంది చెప్పు .. పని కాదని తెలిసినప్పుడు, మాట నిలుపుకోవటంలో వుండే గౌరవం మాట పోగొట్టుకోవటంలో వుండదు...."

"అయితే మనబ్బాయి మనకు దక్కడన్న మాటేనా...."

"అట్లా అనవద్దు. మనం యెవ్వరికీ అన్యాయం చెయ్యలేదు.

అందుకనే మనకు అన్యాయం జరగదని నా గట్టి విశ్వాసం, నమ్మకం

నువ్వు దిగులుపెట్టుకోవద్దు. నాక్కూడా ధైర్యాన్నివ్వాలి. నన్ను ఓదార్చే పరిస్థితి మాత్రం నువ్వు తెచ్చుకోవద్దు. నేను యెంత నిబ్బరంగా వుంటున్నానో, నువ్వొక్కసారి వూహించుకో. నువ్వుకూడా అట్లాగే వుండాలని నా ఉద్దేశం.... ఇంక నన్ను యిట్లా పడుకోనీ " మళ్ళీ కుర్చీలో చేరగిలబడి కళ్ళు మూసుకున్నాడు. కాని నిద్రపోవటంలేదు నిద్రరావటంలేదు. నిద్ర రాదుకూడా.

ఆమె గదిలోకివెళ్ళి పరుపుమీద పడుకుంది. కళ్ళురెండూ తెరుచుకునేవుంది. కాస్త కళ్ళు మూతపడగానే, కొడుకు కనిపిస్తు న్నాడు. ఏవేవో అడుగుతున్నాడు ఏమేమో మాట్లాడుతోంది. ఆమె భరించలేదు. అందుకనే కళ్ళు తెరుచుకునే పడుకుని వుంది.

ఆయన కళ్ళు మూసుకున్నాడు. ఎన్నెన్నో ఆలోచనలు, ఆయన మెదడులో మెసులుతున్నాయి. ఎన్నెన్నో దృశ్యాలు యిట్టే కనిపించి మాయమయి పోతున్నాయి. శిక్షలు పడినవాళ్ళందరూ కట్టకట్టుకుని వచ్చిబెదిరిస్తున్నారు. తనలోతాను నవ్వుకున్నాడు. ప్రతివాడూ నిర్దోషి. నేరం రుజువయ్యేదాకా పెద్దమనిషి. ప్రతి నేరానికి వెనకాల యేదో అగాధమైన గాథ వుంటూనే వుంటుంది. నేరమూ, శిక్ష, యీ రెంటికీ అవినాభావ సంబంధం వుంది. నేరము చేసినవాడూ చెయ్యనివాడూ శిక్ష అనుభవిస్తాడు. శిక్ష అనేది, నేరము చేసినవాడికి పడకపోవచ్చు వందమంది నేరస్థులనైనా వదిలి పెట్టెయ్యొచ్చుగాని, ఒక నిర్దోషిని మాత్రం శిక్షించకూడదు అనే సూత్రం బాగానే వుంది కాని ఒకనేరస్థునికి శిక్ష పడకపోవటంకూడా చాలా ఘోరమైన విషయమే. ఇది సామాజిక సమస్య. సాంఘిక

అవసరము. ఇది కేవలం వ్యక్తిగతమైన విషయం కాదు. నేరస్థుని వదిలేసిననాడు ప్రతీకారవాంఛ కేవలం దెబ్బతిన్న వ్యక్తిలో నే రగుల్కోదు. మొత్తం సంఘం అంతా లేస్తుంది ఇది వాంఛనీయం కాదు నేరస్థునికి విధిగా శిక్ష పడాల్సిందే దీనికి తిరుగులేదు. ఆయన ఆలోచనలు ఆయనకే ఆశ్చర్యంగా వున్నాయి

గభాలున కుర్చీలోంచి లేచి, గదంతా పచార్లుచెయ్యటం మొదలుపెట్టాడు. ఇంత శిక్ష నాకెందుకు వేస్తున్నాడు. నేను ఏ నేరం చేశానని నా జడ్జిమెంట్సువలన, యెవరైనా నిరపరాధి శిక్షకు గురి అయ్యాడా, తనలో తాను చర్చించు కుంటున్నాడు. లంచం తీసుకున్నందుకు, అక్రమమైన చర్యలకు పాల్పడ్డందుకు, కల్తీ కలిపినందుకు, హత్యచేసినందుకు, వీటికేగా నే శిక్షలు వేసింది. దస్తాలు దస్తాలు కాగితాలు వున్నాయి. సాక్షులు, నమ్మతగ్గ కాగితాలు ఇవన్నీ చూసిన తర్వాతేగదా ఆ శిక్షలువేసింది తప్పేమీ లేదు నేను చేసింది తప్పేమీకాదు. తనలో తాను సమాధానపడుతున్నాడు. కాని నేనట్లా యెందుకనుకోవాలి. నేను చేసిన తప్పుకు నాకు శిక్షపడటంలేదు ఎంత తీవ్రంగా ఆలోచించుకున్నా, యెన్ని విధాల వూహించుకున్నా మనస్సుకు శాంతి దొరకటంలేదు ఊరికే అలసటగా గదంతా చకచక తిరుగుతున్నాడు. ఒక్కొక్కప్పుడు శరీరంలోకి వణుకు వచ్చేస్తోంది గుండెమీద చెయ్యి పెట్టుకుని, పెద్దగా శ్వాస పీలుస్తున్నాడు.

'ఎట్లా వుందండి . వెనకాలే శబ్దం వినిపించింది.

'నువ్వు నిద్రపోయావనుకుంటున్నాను ...'

'అవును నాకు నిద్రపట్టాల్సిందే మీ మాదిరి నేను యేమీ ఆలోచించుకోలేక పోతున్నాను ..'

వెనక్కు తిరిగి ఆమెవంకచూసి, యిప్పుడు నిద్రపట్టేటట్టే వుంది అంటూ మంచంమీదికి వెళ్ళి పడుకున్నాడు.

భళ్ళున తెల్లారేటప్పటికి యింకా ఆయన మంచం మీదే వున్నాడు. ఆమె గుర్రుపెట్టి నిద్రపోతోంది.

వంటిమనిషి, కాఫీతెచ్చానంటూ, లేపేటప్పటికి, ఆయన బద్ధకంగా కళ్ళు నలుపుతూ, ఓ చేత్తో కాఫీకప్పును అందుకున్నాడు. ఆమె, గాభరాగాలేస్తూ చాలా పొద్దెక్కిందే అనుకుంది ఇంతలోకి పోర్టికోలో ఓ టాక్సీవచ్చి గభాలున ఆగింది.

నిరంజనరావు, తన గదిలో కూర్చుని కిటికీ కర్టెన్ కొంచెంగా తీసి తొంగిచూశాడు వాకిట్లోకి. ఆశ్చర్యంగా వీళ్లొచ్చారేమిటి యిప్పుడు అనుకున్నాడు తనలో. సుగుణ అదరాబాదరాగా వచ్చి, 'వదినగారూ పిల్లలువచ్చారండీ' అన్నది ఆవేశంగా. భర్త మౌనం చూసి చప్పున ఆశ్చర్యపడి, 'యిప్పుడెట్లా' అన్నది అదుర్దాగా.

'ఇప్పుడొచ్చారేంటి....వస్తున్నట్లు ఉత్తరంకూడా రేదే.... ఆశ్చర్యపోయాడు.

'నే చెపుతూనేవున్నా. వాళ్ళన్ని వుత్తరాలు రాస్తున్నప్పుడు ఏదో సమాధానంగా వుత్తరం రాయమని....'

మెదలకండా వూరుకున్నాడు.

'లోపలికి వస్తున్నారు. మనం యిక్కడ కూర్చుంటే యేంబాగుంటుంది ...'హడావిడిగా వాకిట్లోకి వెళ్ళింది.

'ఏమక్కయ్యా కులాసానా....' వెనకాలే వచ్చిన నిరంజనరావు వర్ధనమ్మను పలకరించాడు.

'బాగానే వున్నాం నాయనా....'

'బావగారూ రండీ....'

సుగుణకు యేంతోచలేదు. ఏం మాట్లాడాలో అసలు అర్థం కావటంలేదు.

"వస్తున్నట్టు మాకుతెలియనే తెలీదు. లేకపోతే స్టేషనుకు కారు పంపించేవాళ్ళం"

....మొహం యింతచేసుకుని, సుగుణ యేదో మాట్లాడింది.

"ఎన్ని ఉత్తరాలు రాసిన సమాధానం లేదు. ఆ పట్టాన మేమే వచ్చేశాం అయినా మామీద మీకు ఆమాత్రం అభిమానం వుంది అదే చాలు....."

'ఏమిటక్కయ్యా ఆ మాటలు అభిమానంలేక ఏమయిందని'

'...మాటవరసకన్నాలే....' నాలుక కరుచుకుంది వర్ధనమ్మ.

పైకి మాట్లాడుతున్నాడన్నమాటే గాని, వీళ్ళు యిప్పుడెందు కొచ్చారా, వీళ్ళను వెంటనే యేవిధంగానైనాసరే పంపిచెయ్యాలి అని త్రీవంగా ఘర్షణ పడుతున్నాడు నిరంజనరావు. సుగుణకు అయోమయంగావుంది. ఏవోపనులుచేస్తోంది. మాట్లాడుతోంది అంతే. అప్పటికే కొడుకుమాట వచ్చేటప్పటికి యేదో విధంగా తప్పించేసింది ఆపూటకు భోజనాలయినాయి త్వరత్వరగా నిరంజనరావు కోర్టుకువెళ్ళిపోయాడు. ఇంట్లో ఒంటరిగావుండిపోయినట్లుగా బెరుకు బెరుకుగా సుగుణ వుండిపోయింది.

"శాయి యింకా రాలేదే...." వర్ధనమ్మ, మాట్లాడుతోందల్లా చప్పునన ఆపేసి అడిగింది.

సుగుణ చప్పునతడబడింది బహుశా యూనియన్ పనుల్లో వూరికేమైన వెళ్ళాలిసి వచ్చిందేమో. వారొచ్చిన తర్వాత సంగతి తెలుస్తుంది...' కొంచెంగా తల వంచుకుని కూర్చుంది.

'వదినా... మీమీద గంపెడాశ పెట్టుకొని వున్నాం. మరేం చేస్తావో నువ్వు, అంతా నీ చేతిలో వుంది, నువ్వుఅవునంటే మా వాడు కాదనడు...

'నాదేముంది వదినగారూ.... అంతా వారి చేతిలో వుంది....' ఏ విషయం మాట్లాడుతోందో అర్థం కాకపోయినా, మామూలుగా అనేసింది సుగుణ.

'తింటున్నామో పస్తుంటున్నామో ఆ భగవంతుడికి తెలుసు. ఏమయినా' జడ్జిగారి కోడలంటే హోదాకు తగ్గట్టుండాలిగదా అని, బి. ఏ దాకా చెప్పిస్తున్నా. వసంత విషయం చెపుతున్నా. అట్లా చూస్తావే....'

'ఆ ఏం లేదు లెండి.... అవును వసంత విషయమే. యిప్పుడు ఫైనలియర్టగా....'

'ఈ ఏడుతో అయిపోతుంది ..'

'తర్వాత ఏంచేద్దామనుకుంటున్నారు' సుగుణకు మతిలో మతి లేదు.

'ఇంకా చేసేదేమిటి పెళ్ళి చెయ్యటమే....' పెద్దగా నవ్వింది వర్ధనమ్మ.

సుగుణకూడా కొంచెంగా నవ్వింది.

'అబ్బాయికి ఈ యేడాదితో యం. ఏ. అయిపోతుంది గాదు....'

అవునవును.... గొంతులో గీర వచ్చేసింది. సుగుణ కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగినాయి.

వస్తా యిప్పుడే అంటూ చివాలునలేచి లోపలికి వెళ్ళి పోయింది సుగుణ.

'ఏమండీ, శాయిమాట ఎత్తితే చాలు సుగుణ అట్లా యిది అయిపోతుందేమిటండీ....'

సత్యమూర్తి ఏమీ మాట్లాడలేదు.

నిరంజనరావు చాలా పెందరాళనే యింటికి వచ్చేశాడు. గబ గబ సుగుణ వెళ్ళి 'ఏమండీ' మీ అక్కయ్యగారు అబ్బాయి సంగతి అడుగుతున్నారు. ఊరు వెళ్ళాడేమో, మీరొచ్చిన తర్వాత తెలుస్తుందని చెప్పానండీ....'

'అట్లాగా, అంత గాభరా యెందుకు నే చూస్తాన్లే'

'తమ్ముడొచ్చినట్లున్నాడు. మీరుకూడా రండి. ఇహ వచ్చిం తర్వాత అడక్కుండా కూర్చుంటే యేం లాభం'.... వర్ధనమ్మ, భర్తనుకూడా తీసుకొని, నిరంజనరావు గదిలోకి వెళ్ళింది.

'పిల్లలందర్నీ యింట్లో వదిలిపెట్టి వచ్చాం....'

'వాళ్ళనుకూడా తీసుకు రాకపోయినావా. నాలుగు రోజులు పాటు బస్తీ అంతా చూసేవాళ్ళు....'

'నువ్వా మాట అంటావని నాకు తెలుసు. మా మీద నీకున్న ప్రేమ అభిమానంకూడా బాగా తెలుసు. ఆ ధీమాతోనే యిక్కడికి వచ్చాం. చెప్పకండా పెట్టకండానూ. చూశారా నేచెప్పలా మీకు, మా తమ్ముడికి మనమంటే యెంతోయిదని...."

నిరంజనరావు సత్యమూర్తి వంకచూస్తూ చిరునవ్వుమొహం
పెట్టాడు

తల్లీతోడూ, నీకు నేను, నాకు నువ్వు యింకెవరున్నారు
నాయనా కష్టం సుఖం నీతో చెప్పుకోకపోతే యింకెవరితో చెప్పు
కుంటాను ...' వర్ధనమ్మ మొదలుపెట్టింది.

నిరంజనరావు కుర్చీలో ఒదిగి కూర్చున్నాడు. వింటున్నట్లు
మెల్లిగా తల వూపుతున్నాడు.

'అమ్మాయిని బి. ఎ చదివిస్తున్నాం. వదినతోకూడా
చెప్పాను. అంతా నీ యిష్టం అంది బాన్నెట్లాగైనా నీ కోడలుగా
చేసుకోవాలి నాయనా... శాయికి ఈడూ జోడూ బాగుంటుంది.
మేమా పెద్ద పెద్ద కట్నాలు యిచ్చుకోలేమనీ నీకు తెలుసు అయి
నప్పటికీ, ఏదో శక్తివంచన లేకండా ముట్టచెప్పుదామనే కొంచెం
కొంచెంగా కూడబెడుతున్నాం పరమేశ్వరుడి దయ ఎట్లావుందో
యేమో....'

'అవన్నీ యిప్పుడెందుకు చెప్పు....'

'ఇప్పుడు కాకపోతే యింకెప్పుడు....'

'అదికాదు ఇంకా వసంత బి. ఏ. చదువుతూనే వుందిగా.
చదువు పూర్తికాని....తర్వాత చూద్దాంలే....'

'అట్లాగే. ఇప్పుడు మాట మాట్లాడుతున్నానా. బి. ఏ. పూర్తి
అయింతర్వాత మాటలే.... మళ్ళీ మరదలొస్తుందేమో. నీ కడుపులో
వుంచుకో.... మా పరిస్థితేమీ బాగాలేదు. పూటపూటకు గడవటమే
మహా కష్టంగావుంది. ఇంటినిండా పిల్లలు. ఎట్లాసంసారం యీదుకు
వస్తున్నామో యేమో ఆ భగవంతుడికే తెలుసు. వాసు బి. ఏ.

పాసయ్యాడు. ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్ని దరఖాస్తులు పెట్టాడో అంతులేదు. ఇంత వరకు యేమీ అచ్చి రావటంలేదు. ఎక్కడకు పోయినా లంచాలు, సిఫార్సులు. మేమా లంచాలు యివ్వలేము సిఫార్సుల సంగతి నీకు తెలిసిందే మీ బావ గారికి ఏం పలుకుబడుందని నోట్లోనాలుకలేదు. ఆడదాన్ని నేనైనా, తెలిసో తెలియకో బడబడా నాలుగు మాట్లాడుతానుకాని, ఆయనకు అదీ చేతకాదు. చెప్పుకుంటే సిగ్గుచేటు. వాడికేదైనా ఉద్యోగం యిప్పించావంటే యేదో గుంభనగా బతుకుతాం లేకపోతే వీధుల పాలయిపోతాం....'

'ఏమిటా మాటలు మరీను...'

'అబద్ధం చెప్పటం లేదు ఉన్న విషయం చెవుతున్నా. నీ దగ్గర దాపరికం యెందుకు కష్టంగా వుందని నాలుగు సార్లు అనుకుంటే కష్టాలు తీరుతాయి కనక, అప్పటికీ వాసును ఎంత రమ్మన మన్నా, నేనెందుకులే. మామయ్యతో నే చెప్పానని చెప్పమని పంపించాడు ఎదో చీటి రాసి యిచ్చాడు. ఆ ఉద్యోగాలేంటో, ఆ పేర్లేమిటో కూడా నాకు సరిగ్గా తెలీదు. వాడు తగని బిడియ పడ తాడు. చెడ్డ అభిమానం. అంతా నీ పోలికే.... సంతృప్తి పడుతోంది వర్ధనమ్మ.

ఆ చీటి చూస్తూ నిరంజనరావు పెద్దగా నిట్టూర్చి, కుర్చీలో వత్తిగిలుతున్నాడు. మనస్సులో మధనపడుతున్నాడు, ఏమిటి చెయ్యటమా అని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

'శాయి ఊరు వెళ్ళాడేమో అంటుంది. అంత మీకు చెప్ప కండా వూళ్ళు వెళ్ళేటంత అర్జంటు పన్లేముంటాయి. ఆయినా నాకు తెలీదులే....' ఆపేసింది వర్ధనమ్మ.

"వాళ్ళ స్టూడెంట్స్ యూనియన్లో పన్ల మీద అప్పుడప్పుడు బైటకుకూడా వెళుతూ వుంటాడులే. అయినా చెప్పక పోవటం యేముంది. రెండు రోజుల్లో వస్తానని చెప్పే వెళ్లాడుగా...."

'ఏొన్నే ఇంత దూరం వచ్చిన వాళ్లం యీ రెండు రోజులూ వుండి వాడిని చూసి వెళ్లి తేనే మనసుకి తృప్తిగా వుంటుంది....' వర్ధనమ్మ మామూలుగా అనేసింది.

నిరంజనరావు ఒక్కక్షణం ఆమె మొహంలోకి చూసి మళ్లీ తల అపత్రలకు తిప్పేశాడు.

'ఏం రాశాడు ఆచీటీలో....'

'అదే చూస్తున్న...'

ఆ ఉద్యోగాలు మంచివేనా!

'ఆ!....'

ఏదో నాయనా ఓ దారి చూపించు రోజురోజుకు ధరలు పెరిగి పోతున్నాయీ, బజార్లోకి వెళ్లేటట్టుందా, ఏమైనా కొనేటట్టుందా.... మరి ఎట్లా వెళతాయో రోజులు. తలుచుకుంటే భయమేస్తోంది. వసంతకు పెళ్ళిచేసి, వాసు ఉద్యోగస్తుడయితే. మాకు మూడొంతులు భారం తాగ్గుతుంది. తర్వాత ఆ పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయినపుడు చూసుకోవచ్చు. తల్లీతోడుకాబట్టి, అరమరికలు లేకుండా వున్నదివున్నట్టు చెప్పకున్నా.... అదుగో మరదలు వస్తున్నట్టుంది...'

సుగుణవచ్చి, ఫలహారం చేద్దురుగాని రండిలోపలికి అన్నది.

వర్ధనమ్మ, సత్యమూర్తి చప్పున లేచారు.

'ఏమిటి అట్లా చూస్తున్నారు....'

'ఏం లేదు. పెద్ద చిక్కే వచ్చేటట్టుంది... చెపుతా నువ్వు వద....' నిరంజనరావు తల పట్టుకుని కూర్చున్నాడు.

నేనింతవరకు యెవ్వరికీ సిఫార్సులు చెయ్యలేదు. చెయ్య కూడదుకూడా. ఎంతో స్ట్రిక్ట్‌గావుంటూ చాలా మందికి విరోధిని అయ్యాను నా డ్యూటీని నేను సక్రమంగా నెరవేరుస్తాననే తృప్తి ఒక్కటే మిగిలివుంది నన్ను అందరూకూడ అపార్థం చేసుకున్నారు. గర్వమని, మానవత్వములేదని, కఠినహృదయుడు అని ఎన్నెన్నో టైటిల్స్ తెచ్చుకున్నాను. ఇవన్నీ నాకెట్లా వచ్చినాయి. నా డ్యూటీ నేను చేస్తున్నందుకు నా హితులు నాకిచ్చిన బిరుదులు. అన్నీ సహించాను. అన్నీ భరించాను. ఈ వెలి వేస్తున్న సంఘంలో యింకా నేను ఒంటరిగా యిట్లాగే యెన్నాళ్లు వుండగలను. ఉండ లేమోనని భయమేస్తోంది. అక్కయ్య సంసారం యింత దీన స్థితిలో వుందని నాకు తెలీదు. ఒకవేళ డబ్బు యిచ్చినా ఆమె తీసు కుంటుందో లేదో. అయినా ఒకసారి రెండుసార్లు యివ్వ గలుగు తాము అంతేగా. శాయి వచ్చేదాకా వుంటానంటూంది ఆహా, శాయి యెప్పుడు వస్తాడు అసలు శాయి మళ్లీ యీ యింట్లో అడుగు పెడతాడా. పెట్టగలడా. మళ్ళీ అవిడ శాయి యెప్పుడు వస్తాడు యెక్కడికి వెళ్ళాడు అని అడిగితే సమాధానం యేమని చెప్పాలి. అబ్బ, యిదంతా అగమ్యగోచరంగా వుంది. పెద్ద సమస్య తెచ్చి పెట్టింది, గదంతా ఊరికే పచార్లు చేస్తున్నాడు. ఎటూ తోచటం లేదు. ఎంత తీవ్రంగా ఆలోచిస్తే, అంత ఆరాటం, అవేదన యెక్కువయి పోతున్నాయి. మనస్సు నిలవటంలేదు. తెగ బాధ పడుతున్నాడు.

'మీరు రండీ.... వాళ్ళు మీ కోసం యెదురు చూస్తున్నారు....' సుగుణ వచ్చి అన్నది.

ఉలిక్కిపడి ఆ౦.... వస్తున్నా... అన్నాడు.

'మన నీడ మనం చూసుకుని భయపడాల్సిన రోజు వచ్చింది...' అనుకుంది సుగుణ. ఆమె మెదలకుండా వెళ్ళిపోయింది డైనిగ్ హాలులోకి. ఆమె నిరంజనరావు కంటే నిబ్బరంగా వుండిపోయింది. ఇప్పుడు ఆయనే విలవిలలాడిపోతున్నాడు. సూటిగా వచ్చి ఫలహారంచేసి మళ్ళీ మెదలకుండా వెళ్ళి గదిలో పడుకున్నాడు.

ఒకటి రెండుసార్లు వర్దనమ్మ గదిదాకా వెళ్ళి తొంగి చూసి పోతోంది. నిరంజనరావు గమనిస్తూనే వున్నాడు

'అక్కయ్యా' అన్నాడు

సంతోషంగా చప్పున లోపలికి వెళ్ళింది వర్దనమ్మ.

'ఈ ఉత్తరం వాసుకియ్యి. దీంట్లో అంతా రాశాను....' కొస్త పస్తాయించి, 'రేపే యివ్వాలి యీ ఉత్తరం'- అన్నాడు ఆయాసపడుతూ.

'ఉద్యోగం వచ్చేస్తుందా నాయనా?'

'ఆ...'

'అయితే యీ రాత్రికే వెళ్ళిపోతాం.'

'మరి '

'నువ్వేమీ అనుకోవద్దు. ఇహ రామా, పోమా. ఈసారి వచ్చేటప్పుడు పిల్లలందర్నీకూడా తీసుకొచ్చి, నాలుగు రోజులుండే

టట్లే వస్తాము. శాయిని అడిగామని చెప్పు. వాడిని చూడకండా వెళ్ళడం మాకు పెద్దలోటుగానే వుంది. కాని పరిస్థితులు యిట్లా వచ్చినాయి. రేపే యీ ఉత్తరం యివ్వాలంటున్నావైను....'

వర్ధనమ్మ అంటుంటే నిరంజనరావు తలవంచుకున్నాడు.

రాత్రి బండికే అక్కయ్యను, బావను పంపించేసి, యింటికి వచ్చి రొప్పుతూ మంచం మీద పడుకున్నాడు. తెగ ఆయాస పడుతున్నాడు.

'ఏమిటి, యెట్లా వుందండి...' సుగుణ మెల్లిగా వచ్చి నిలబడింది.

'నా పని అయిపోయింది.... నేను అన్నీ పోగొట్టుకున్నాను. ఏ సిఫార్సూ ఎవ్వరికీ చెయ్యనివాణ్ని, యివ్వాళ సిఫార్సు ఉత్తరం యిచ్చాను. రేపే ఆ ఉత్తరం యివ్వాలని అబద్ధం చెప్పాను. జడ్జిగా నేను ఏ పనులు చెయ్యకూడదో ఆ పనులు చేశాను. సుగుణా! నా కిలాంటి దుస్థితి యెందుకొచ్చిందంటావు....'

'ఏమిటి మీరంటోంది. నాకేమీ తెలీటంలేదు.... ఎందుకు అంత యిదవుతారు. మేనల్లుడికి ఉద్యోగం యిప్పించారు. ఇది ఉపకారమేగాని అపకారమేమీకాదే. మీరు ఎవ్వరికీ ద్రోహం చెయ్యలేదు. అన్యాయం అంతకంటే చెయ్యలేదు. ఏదైనా అన్యాయం జరుగుతే మనకు జరుగుతుందేమో. నాకు మీరు యెన్నో చెప్పి, మీరిట్లా యిదవటం ఏమీబాగాలేదు. మీరు ఉద్రేకపడటం, మంచిదికాదని డాక్టరు యెన్నోసార్లు చెప్పాడు...' సుగుణభర్తకి ధైర్యం చెపుతోంది.

'నాకేమీ అర్థం కావటంలేదు, తెలీటంలేదు. మతిపోతున్న ట్లుంది. చాలాభయుంగా కూడావుంది...'

'మీరు పడుకోండి. మీకు రెస్ట్ చాలా అవసరం....' సుగుణ వంటింట్లోకి వెళ్ళి ఉద్వేగం అంతా వెళ్ళబుచ్చుకుంది.

ఆ రాత్రికూడా ఎట్లా గడిచిపోయిందో, యిద్దరికీ ఆశ్చర్యం గానేవుంది.

నిరంజనరావు ముభావంగా వుండిపోయాడు. సుగుణ ఎన్నిసార్లు పిలిచినా సమాధానం ఇవ్వలేదు.

'మీరు నాతో .మాట్లాడరా...' జాలిగా అన్నది.

ఇంకా బండరాయి అయిపోయాడు.

యాంత్రికంగా పనులుచేసుకుంటూ, టైము చూసుకుంటూ నిరంజనరావు పదిన్నర అవుతుండగా, కోర్టుకు వెళ్ళటానికి, పోర్టి కోలో కారుదగ్గరకు వెళుతున్నాడు. సుగుణకూడా దిగాలుపడి, క్రుంగిపోయి, పిచ్చిదానిలాగ, ఆయన వెనకాలే కారుదాకా వెళ్ళి నిలబడింది.

'ఈ రోజే జడ్జిమెంటు....' చప్పున కారులోకి వెళ్ళి కూర్చు న్నాడు.

'ఆ!....' ఆశ్చర్యపోతూ శూన్యంలోకి వెర్రిగా చూసింది కారు బర్రున దూసుకుపోయింది.

క్షణక్షణానికి టైము చూసుకుంటోంది. తానుకూడా కోర్టుకు వెళితే బాగుంటుందేమో అనుకుంటోంది. మళ్ళీ వస్తాయిస్తోంది. ఏం తీర్పు వస్తుందో యేమో అని ఆందోళనపడుతోంది.

శాయి అంత ఘోరనేరం చేశాడంటే నమ్మలేకుండా వున్నాను. కాని హత్యచెయ్యటం కళ్ళారా చూసిన వాళ్ళు చెప్పారు నమ్మకండా ఎట్లా వుండటం! రౌడీలతో సహవాసం చేసి పేరుప్రతిష్టలు మంట కలిపేసి చదువులు నాశనం చేసుకుని యింత దిగజారిపోతాడని కలలోకూడా వూహించలేకపోయాను. ఇంత ఘోరానికి పాలుపడినవాన్ని భగవంతుడుకూడా క్షమించలేడు గుడ్డి ప్రేమ కన్నతల్లి ప్రేమ. ఛీ! శాయి నాకొడుకుకాదు వాడికి యే శిక్ష విధించినాకూడా నాకు సంతోషమే. నేను యెందుకు దుఃఖ పడాలి. దేనికోసం బాధపడాలి. అన్నీ పోగొట్టుకున్న తర్వాత జీవ చ్ఛవంలాగ శాయిని యీ యింట్లో చూస్తూ నరకం అనుభవించ లేను. నా మాట వినలేదు తండ్రిమాట వినలేదు, తాను బాగుపడ లేదు మేమొకళ్ళం వున్నామనే ఆలోచనకూడా లేకుండా ప్రవ ర్తించాడు. మాకు వాడు లేడు. అంతే సుగుణ రకరకాలుగా ఆలో చిస్తూ ఆరాటపడిపోతోంది. గోడగడియారం గంటలు కొట్టంగానే చప్పున తలెత్తి చూసింది అయిదయింది— వాకిట్లో కారు చప్పు డయింది గభాలున లేచి వెళ్ళింది.

నిరంజనరావు కారు దిగి యెంతో నిబ్బరంగా లోపలికి వచ్చేశాడు. కుర్చీలో కూలబడ్డాడు.

'... సుగుణా అయిపోయింది... మనకు ఒక్క కొడుకు. వాడు కాస్తా లేకపోతే మనిద్దరం యేమయిపోతామో యెంత ఆవే దన పడతామో మన మానసిక బాధ యేమిటో ఆ పట్నాయక్ తెలుసుకున్నాడు. మనమీద జాలి పడ్డాడు సానుభూతి చూపించాడు. తోటి జడ్జికి యెంతో సహాయం చేశాడు...' నిరంజనరావు చెప్తూతూ పోతున్నాడు

కళ్ళు పైకెత్తి చూసేటప్పటికి, సుగుణ బొమ్మలాగ నిలబడి వుంది చైతన్యరహితంగా.

'... సుగుణా .... మనబ్బాయిని విడుదల చేశారు...' గట్టిగా అరిచాడు నిరంజనరావు ఆయాసపడుతూ కుర్చీలో వెనక్కు పడ్డాడు.

ఆ అరుపుతో సుగుణ తెప్పరిల్లి కనురెప్పలు తెరుచుకుంది. ఆమె కళ్ళవెంబడి నీళ్ళు ధారగా కారుతున్నాయి. అవి ఆనంద భాష్పాలో, కన్నీరో ఆమెకే తెలియాలి.